186) శంకరాభరణం

ప॥ ఆహా యేమిచెపేది హరి నీమాయ। మోహములే చిగిరించి మొదల జవ్వనము॥

చ॥ యెంచగ భూమి యొక్కటే యేలినరాజు లెందరో। పొంచి వారివెంటవెంట బోవదాయను।
అంచలసూర్యచంద్రులనే గడెకుడుకల। ముంచి కొలచి పోసీని మునుకొని కాలము॥

చ॥ దేవలోక మొక్కటే దేవేంద్రు లెందరో। కైవశమై యేలగ నొక్కరిదీ గాదు।
ఆవటించి పంచభూతాలనేటిశాఖలు వెళ్ళి। సావధాన బెరిగి సంసారవృక్షము॥

చ॥ యిచ్చట నీ వొక్కడవే యిటు నీదాసు లెందరో। తచ్చి యెంత సేవించినా దనివిలేదు।
నిచ్చలు శ్రీవేంకటేశ నిధానము నీభక్తి। యెచ్చినాడ వింతటా నీడేరీ జన్మము॥